క్లుప్తంగా

కొనసాగుతున్న రైతుల దీక్ష



దీక్షకు సంఘీభావం తెలిపిన నాయకులు

కడ్తాల్: పంట పొలాల మీదుగా 765 కేవీ బీదర్– మహేశ్వరం హైటెన్షన్ విద్యుత్ లైన్ ఏర్పాటుతో నష్టపోతామని, వెంటనే అలైన్‌మెంట్‌ను మార్చాలని బాధిత రైతులు డిమాండ్ చేశారు. లైన్ మార్చాలని కోరుతూ చేపట్టిన దీక్ష శనివారానికి పదమూడో రోజుకు చేరుకుంది. దీక్షకు సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, రామకృష్ణ, జహంగీర్‌అలీ, వివిధ పార్టీలు, సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. అలైన్‌మెంట్ మార్చే వరకు రైతులకు అండగా ఉంటామని చెప్పారు. నాయకులు రాజేందర్‌యాదవ్, మహేశ్, గోరటి కృష్ణ, గంట శ్రీనివాసులు, కృష్ణయాదవ్, నర్సింహ పాల్గొన్నారు.

స్వచ్ఛతా హీ సేవ



స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తున్న అధికారులు, నాయకులు

కడ్తాల్: స్వచ్ఛతా హీ సేవ– 2025 కార్యక్రమం శనివారం మండల కేంద్రంలో నిర్వహించారు. ఇందులో భాగంగా మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, పంచాయతీ కార్యదర్శి అల్లాజీలు.. పారిశుద్ధ్య నిర్వహణ, పరిసరాల శుభ్రత, ప్లాస్టిక్ వ్యర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. తడిపొడి చెత్త వేరు చేయాలని సూచించారు. పలు కాలనీల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. నాయకులు బ్రహ్మచారి, అంజి, సత్యనారాయణ, శ్రీను, ఆశ కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

సైబర్ నేరాలతో అప్రమత్తత అవసరం



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సీఐ మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్నం మున్సిపాలిటీ కేంద్రంలోని గురునానక్ ఇంజినీరింగ్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బెట్టింగ్, లోన్ యాప్‌ల ద్వారా నష్టపోయి, డబ్బులు చెల్లించలేక అనేక మంది ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాంలో కొత్త వ్యక్తుల పరిచయాలు ఇబ్బందులకు గురి చేస్తున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి మోసాలకు గురి కాకుండా జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉందన్నారు. అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాలకు గురైన వారు.. వెంటనే టోల్‌ఫ్రీ 1930కి కాల్ చేయాలని చెప్పారు. ఈ సందర్భంగా ఫ్రికూస్ ప్రైవేటు లిమిటెడ్ అధినేత ప్రమీల్ అర్జున్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం వారికి పోలీస్ శాఖ నుంచి సర్టిఫికెట్లు అందజేశారు.

ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న విపక్షాలు

పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్



మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

కడ్తాల్: రాష్ట్ర ప్రగతిని జీర్ణించుకోలేక విపక్షాలు రాజకీయ కుట్రలు చేస్తూ.. ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్ విమర్శించారు. శనివారం మండల కేంద్రంలో వారు మాట్లాడారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయలు, బతుకమ్మ పండుగ విశిష్టతను దెబ్బతీసేలా బీఆర్ఎస్ పార్టీ వ్యవహరిస్తోందని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో, ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిల చొరవతో నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని తెలిపారు. అయినప్పటికీ.. కొందరు ఎమ్మెల్యే కసిరెడ్డిపై అసత్య ప్రచారాలు సాగిస్తున్నారని మండిపడ్డారు. ట్రిపుల్‌ఆర్ విషయంలోను రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోలేదని, రైతులకు మేలు జరిగేలా నిర్ణయం తీసుకుంటుందన్నారు. వాస్తవాలు గ్రహించకుండా తమ రాజకీయ ఉనికి కోసం ప్రభుత్వాన్ని, ఎమ్మెల్యేను విమర్శించడం తగదన్నారు. సమావేశంలో మాజీ సర్పంచ్ శంకర్, నాయకులు జగన్, జహంగీర్‌అలీ, శేఖర్, రాంచందర్, హీరాసింగ్, శ్రీను, తులసీరాం, రవి ఉన్నారు.

ఖాతా తెరవండి.. రుణం పొందండి

- ప్రజల వద్దకు డీసీసీబీ సిబ్బంది
- ఖాతాల సంఖ్య పెంచేందుకు కృషి
- ఇప్పటికే 65 మంది చేరిక
- త్వరలో మాల్‌లో పీఏసీఎస్ ఏర్పాటు, బడ్జెట్ కేటాయింపు



యాచారం: ఖాతాదారులుగా చేరి, బ్యాంకు సేవలు పొందాలని మాల్ డీసీసీబీ(జిల్లా సహకార కేంద్ర బ్యాంకు) బ్రాంచ్ ఉద్యోగులు ప్రజలను కోరుతున్నారు. రూ.వెయ్యితో చేరి, డిపాజిట్లు చేయాలని, రుణాలు పొందాలని సూచిస్తున్నారు. ఆగస్టు 12న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్యలు ఈ బ్రాంచ్ సేవలను ప్రారంభించగా.. ఇప్పటి వరకు 65 మంది ఖాతాదారులుగా చేరారు. రూ.5 లక్షల వరకు బంగారంపై రుణాలు పొందారు.

వ్యాపారులకు..

వ్యాపార పరంగా దినదినాభివద్ధి చెందుతున్న మాల్ మార్కెట్‌లో బ్రాంచ్‌ను ప్రారంభిస్తే ఖాతాదారులకు గణనీయంగా సేవలు అందించవచ్చనేది డీసీసీబీ భావన. ఈ శాఖ కింద మంతన్‌గౌరెల్లి, మంతన్‌గౌడ్, మాల్, నల్లవెల్లి, తమ్మలోనిగూడ, చింతపట్ల, తక్కళ్లపల్లి, కొత్తపల్లి, కిషన్‌పల్లి, సూల్తాన్‌పూర్ గ్రామాలను చేర్చారు. ఈ పది గ్రామాల రైతులతో పాటు వ్యాపారులకు సేవలను అందించనున్నారు.

పీఏసీఎస్ ఏర్పాటైతే..

మాల్‌లో డీసీసీబీ ఏర్పాటు చేసినప్పటికీ.. కొత్తగా పీఏసీఎస్(ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం) ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. అనంతరం యాచారం పీఏసీఎస్‌లో ఖాతాదారులుగా ఉన్న మాల్, నల్లవెల్లి, మంతన్‌గౌరెల్లి, తమ్మలోనిగూడ, చింతపట్ల, తక్కళ్లపల్లి, కొత్తపల్లికి చెందిన 3,500 మంది రైతుల ఖాతాలను ఇక్కడికి బదిలీ చేయనున్నారు. ఇక్కడ పరపతి సంఘం ఏర్పాటు అయితే.. డీసీసీబీ ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయిస్తుంది. ఈ బడ్జెట్ ద్వారా దీర్ఘ, స్వల్పకాలిక రుణాలను పీఏసీఎస్ భరోసాతో రైతులకు రుణాలు ఇచ్చే అవకాశం ఉంది. కొత్తగా 13 మంది డైరెక్టర్లు, అందులో ఒకరు చైర్మన్‌గా నియమించబడతారు.

దూరభారం..



మాల్‌లో పీఏసీఎస్‌ను ఏర్పాటు చేస్తే యాచారం వెళ్లాల్సిన అవసరం ఉండదు. ఇక్కడే దీర్ఘ, స్వల్పకాలిక, వ్యవసాయ పంటల రుణాలను పొందవచ్చు. యూరియాను కొనుగోలు చేయవచ్చు. ప్రభుత్వం వెంటనే సంఘాన్ని ఏర్పాటు చేయాలి. దీంతో దూరభారం తప్పుతుంది. సమయం మిగులుతుంది.

– కర్రె బుచ్చయ్య, రైతు, తమ్మలోనిగూడ

ప్రత్యేక నిధులు



నూతనంగా ప్రారంభించిన డీసీసీబీ బ్రాంచ్‌లో ప్రజలు ఖాతాదారులుగా చేరండి. ఆభరణాలు తాకట్టు పెట్టి రుణాలు పొందండి. మాల్‌లో పీఏసీఎస్ ఏర్పాటు అయితే.. డీసీసీబీ ప్రత్యేక నిధులు కేటాయించే అవకాశం ఉంది. దీంతో దీర్ఘ, స్వల్పకాలిక రుణాలు పొందొచ్చు.

– శ్రావణ్‌కుమార్, మేనేజర్, డీసీసీబీ బ్రాంచ్, మాల్

విస్తృత పర్యటన



ఖాతాదారులుగా చేరాలని కోరుతున్న సిబ్బంది

మాల్ బ్రాంచ్‌లో ఖాతాదారుల సంఖ్య పెంచేందుకు.. బ్యాంకు మేనేజర్ శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది మాల్, నల్లవెల్లి, మంతన్‌గౌరెల్లి, కొత్తపల్లి, తక్కళ్లపల్లి, చింతపట్ల, తమ్మలోనిగూడ గ్రామాల్లో పర్యటిస్తున్నారు. రూ.వెయ్యితో చేరి, డిపాజిట్లు చేయాలని, బంగారు నగలపై రుణాలు పొందాలని, భవిష్యత్తులో గృహ నిర్మాణ, వ్యక్తిగత రుణాలు ఇస్తామని అవగాహన కల్పిస్తున్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



ఎమ్మెల్యే కసిరెడ్డికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు


ఆమనగల్లు: కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలనలో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. నియోజకవర్గ పరిధికి చెందిన పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను ఆయన.. నగరంలోని తన నివాసంలో శనివారం బాధితులకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీలు అమలు అవుతున్నాయని, దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అశోక్‌రెడ్డి, కేశవులు, సురేందర్‌రెడ్డి, జగన్‌గౌడ్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉత్సవాలకు ఆహ్వానం.

వాసవీ కన్యకా పరమేశ్వరి, భక్తమార్కండేయ స్వామి ఆలయాల్లో నిర్వహించే శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆహ్వానిస్తూ.. ఆయా ఆలయాల నిర్వాహకులు ఎమ్మెల్యే కసిరెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఇందులో పరమేశ్వరి ఆలయ ఫౌండర్, సభ్యుడు రమేశ్, కమిటీ చైర్మన్ రామ్మోహన్, ప్రధాన కార్యదర్శి నర్సింహ, కోశాధికారి డాక్టర్ శ్రీనివాస్‌లు ఉన్నారు.

రేపటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు





ఆమనగల్లులోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం (ఇన్‌సెట్లో) అమ్మవారు

- ముస్తాబైన వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం
- రోజుకో రూపంలో దర్శనమివ్వనున్న దుర్గామాత
- భక్తులకు నిత్యఅన్నదానం
- అక్టోబర్ 4 వరకు వేడుకలు

ఆమనగల్లు: దేవీశరన్నవరాత్రి ఉత్సవాలకు శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయం ముస్తాబైంది. ఈ నెల 22 నుంచి అక్టోబర్ 4వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నారు. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి గడియలు ప్రవేశించడాన్ని ఉత్సవాలకు అంకురార్పణ చేస్తారు. ఇందులో భాగంగా అమ్మవారు రోజుకో అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ నేపథ్యంలో నిత్య యజ్ఞం, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేస్తారు. సామూహిక కుంకుమార్చన, వ్రతాలు నిర్వహిస్తారు.

అలంకారాలు

ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు రోజుకో రూపంలో దర్శనమివ్వనున్నారు. తొలుత 22న బాలాత్రిపుర సుందరీ దేవి అలంకారంలో పూజలు అందుకుంటారు. అనంతరం 23న గాయత్రీ, 24న అన్నపూర్ణ, 25న కాత్యాయనీ, 26న ధనలక్ష్మి, 27న లలితాదేవి, 28న శాకాంబరి, 29న సరస్వతి, 30న దుర్గాదేవి, అక్టోబర్ 1న మహిషాసుర మర్ధిని, 2న రాజరాజేశ్వరి, 3న విజయలక్ష్మి, 4 ముగింపు రోజున దుర్గామాత అలంకారంలో దర్శనమిస్తారు. అమ్మవారిని ఊరేగించి నిమజ్జనం చేస్తారు.

ఏర్పాట్లు ముమ్మరం



దేవీశరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు ముమ్మరం చేశాం. వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయాన్ని సుందరీకరించాం. భక్తులకు ఇబ్బంది కలగకుండా అన్ని సౌకర్యాలు సమకూరుస్తున్నాం. నిత్య పూజలతో పాటు, భక్తులకు అన్నదానం చేస్తాం.

– రామ్మోహన్, ఆలయ కమిటీ అధ్యక్షుడు

అలైన్‌మెంట్ ప్రకారం ట్రిపుల్‌ఆర్ నిర్మించాలి



జంగరెడ్డిపల్లిలో ట్రిపుల్‌ఆర్ భూ బాధితులతో మాట్లాడుతున్న వెంకటేశ్

ఆమనగల్లు: ట్రిపుల్‌ఆర్‌ను పాత అలైన్‌మెంట్ ప్రకారం నిర్మించాలని మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ డిమాండ్ చేశారు. ట్రిపుల్‌ఆర్‌లో భూములు కోల్పోతున్న రైతులకు మార్కెట్ రేట్‌కు పదిరెట్లు ఎక్కువగా పరిహారం అందించాలన్నారు. భూములు కోల్పోతున్న తలకొండపల్లి మండలం జంగారెడ్డిపల్లి, తదితర గ్రామాల రైతులతో శనివారం ఆయన మాట్లాడారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో చేసిన ప్రణాళిక ప్రకారమే ట్రిపుల్‌ఆర్‌ను నిర్మించాలని కోరారు. బాధితులకు మరోచోట భూమి ఇప్పించాలని కోరారు. వారికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని, అవసరమైతే సుప్రీం కోర్టుకు వెళ్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నిర్మల, సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు గోపాల్‌నాయక్, తలకొండపల్లి మాజీ సర్పంచ్ జ్యోతయ్య, నాయకులు లక్ష్మణ్ నాయక్, రైతులు పాల్గొన్నారు.

ఫొటోట్రేడ్ ఎక్స్‌పోకు తరలిన ఫొటోగ్రాఫర్స్



కార్యక్రమానికి వెళ్తున్న సంఘం నాయకులు

ఆమనగల్లు: నగరంలో నిర్వహిస్తున్న ఫొటోట్రేడ్ ఎక్స్‌పోకు శనివారం తలకొండపల్లి మండలం నుంచి పలువురు ఫొటోగ్రాఫర్స్ తరలివెళ్లారు. ఇందులో సంఘం మండల అధ్యక్షుడు మహేశ్, ప్రధాన కార్యదర్శి శేఖర్, కోశాధికారి ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్, సభ్యులు నర్సింహ, నాగులు, రమేశ్, కృష్ణ, తరుణ్, మహేశ్, శ్రీనునాయక్, వేణు, సాయి, మధు, శివ తదితరులు ఉన్నారు.

వికలాంగుల పింఛన్లు పెంచాలి

వీహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి నాగార్జున



కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం.. వికలాంగులకు పింఛన్లు పెంచాలని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి నాగార్జున శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంద కృష్ణ మాదిగ పిలుపుమేరకు మండల పరిధి ఉప్పరిగూడలో సమితి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారం చేపట్టి రెండేళ్లు కావస్తున్నా.. ఇచ్చిన హామీని కాంగ్రెస్ సర్కార్ అమలు చేయడం లేదని విమర్శించారు. మాట ప్రకారం.. వికలాంగులకు రూ.6 వేలు, వృద్ధులు, వితంతువులకు రూ.4 వేలు ఇవ్వాలని, లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వీహెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడు నర్సింహ, ఎంఆర్‌పీఎస్ నాయకుడు అంజయ్య, సతీష్ ఉన్నారు.

మాదకద్రవ్యాల నివారణకు కృషి

బీఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ రాంరెడ్డి



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న రాంరెడ్డి తదితరులు

ఇబ్రహీంపట్నం రూరల్: మాదకద్రవ్యాల నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని బీఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బూడిద రాంరెడ్డి అన్నారు. డ్రగ్స్, ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్స్, సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించడానికి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 26, 27 తేదీల్లో బాల బాలికలకు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీలు నిర్వహించనున్నామని తెలిపారు. ఈ మేరకు శనివారం ఉప్పరిగూడ గ్రామంలో వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మంగళ్‌పల్లి గేటు సమీపంలో టోర్నీ నిర్వహించనున్నామని పేర్కొన్నారు. విజేతలకు నగదుతో పాటు జ్ఞాపికలు అందజేస్తామని చెప్పారు. ఎలాంటి ప్రవేశ రుసుం లేదన్నారు. పోటీల్లో పాల్గొనే వారు ఆధార్ కార్డు కలిగి ఉండి, మున్సిపాలిటీకి చెందిన వారై ఉండాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాదగిరి, మాజీ ఎంపీటీసీ రవీందర్, మాజీ ఉప సర్పంచ్ నర్సింహారెడ్డి, నాయకులు గోపాల్, చంద్రశేఖర్, వెంకటేశ్, చంటి పాల్గొన్నారు.



మాడ్గుల: కస్తూర్బా పాఠశాలలో బతుకమ్మతో ఉపాధ్యాయినిలు



ఆమనగల్లు: గిరిజన ఆశ్రమ పాఠశాలలో పూలగోపురంతో ఉపాధ్యాయబృందం



యాచారం: కుర్మిద్ద ఉన్నత పాఠశాల ఆవరణలో..

బడిలో బతుకమ్మ సంబురాలు

తెలంగాణ సంప్రదాయ సాంస్కృతికకు ప్రతీకగా నిలిచిన బతుకమ్మ సంబురాలు ముందస్తుగా ఘనంగా జరిగాయి. దసరా సెలవుల నేపథ్యంలో శనివారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు, ఉపాధ్యాయబృందం తీరొక్క పూలతో పూలగోపురాలను అందగా పేర్చారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో ప్రతిష్టించి, బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అంటూ ఆడిపాడారు.

–సాక్షి, నెట్‌వర్క్



ఇబ్రహీంపట్నం రూరల్: కొంగరకలాన్‌లో..



కడ్తాల్: బతుకమ్మలతో విద్యార్థినులు



యాచారం: గునుగల్ ఆదర్శ పాఠశాలలో..



యాచారం: నిమజ్జనానికి..



ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్లలో..

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆదిబట్ల సీఐ రవికుమార్ అన్నారు. శనివారం టీసీఎస్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాఫ్ట్‌వేర్ సంస్థలో పని చేస్తున్న డ్రైవర్లు తప్పని సరిగా ట్రాఫిక్స్ రూల్స్ పాటించాలన్నారు. సీటు బెల్టు ధరించాలని చెప్పారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ పెట్టుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మహిళా ఉద్యోగుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేశ్, డ్రైవర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై సమగ్ర విచారణ చేపట్టాలి

ఆర్డీఓ అనంతరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ అనంతరెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ఓటరు జాబితాపై సమగ్ర సర్వే నిర్వహించి, నకిలీ ఓటర్లను గుర్తించాలని ఆర్డీఓ అనంతరెడ్డి బీఎల్‌ఓలను ఆదేశించారు. శనివారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధి బొంగ్లూర్‌లోని ఓ కన్వెన్షన్ హాల్‌లో స్పెషల్ ఇన్‌సెంటివ్ రివిజన్(ఎస్ఐఆర్) ప్రిపరేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ సమగ్రంగా చేపట్టాలన్నారు. పాత ఓటరు లిస్టు, 2025 జాబితాలను పోల్చి, తేడాలను గమనించాలని సూచించారు. ఏమైనా తప్పిదాలు ఉంటే.. అధికారుల దృష్టికి తీసుకెళ్లి, ప్రత్యేక జాబితా తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు ప్రసాద్, అయ్యప్ప, సుదర్శన్‌రెడ్డి, డీటీ శ్రీనివాస్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.